# జ్ఞాపకాల ఉపయోగం

ఎటువంటి వారికయినా గతం గుర్తుకు రాకుండా వుండదు. కొంతమంది తీరుబడిగా ఉన్నప్పుడు, అప్రయత్నంగానే జ్ఞాపకాలలోకి వెళ్ళిపోతుంటారు. రామనాథంగారు అదే స్థితిలో వున్నారు. కాఫీ, పేపరు, టిఫిన్ పనులు అయ్యాయి. అప్పుడే.. ఆ సమయంలో దూరంనుంచి అస్పష్టంగా ఓ గాలితెర. ఆ తెరతీసుకొచ్చిన ధ్వని... ఎప్పటిదో పాట...ఆలా పాత సినిమా పాటఅన్నంత వరకే తెలుస్తోంది... ఏ సినిమాలోదో, సాహిత్యం ఏమిటో తెలిసేలా లేదు.

కూర్చున్న కుర్చీలోంచి లేవబోయారు. మళ్ళీ ఆగిపోయారు. బద్ధకం... గతంలో ఇంతబద్ధకం ఉండేది కాదు. కిందటినెలే షష్టి పూర్తి చేశారు పిల్లలు.

లండన్ నుంచి కూతురు అల్లుడు, అమెరికా నుంచి కొడుకు, కోడలు, మనవడువచ్చారు. పట్టుపట్టి పెళ్ళంత సందడిగా చేశారు. అంతా ఓ ప్రణాళిక ప్రకారం వాళ్ళు చేసిన ఏర్పాట్లు చాలా చక్కగా కుదిరాయి.

బంధువుల్నే కాదు, ఆయన చిన్నప్పటి స్నేహితుల్ని కూడా ఆహ్వానించారు. షష్టి పూర్తి జ్ఞాపకాల సాకారం అయింది. ఆ ఉత్సాహం ఇంకా రామనాథంగారిలో కదుల్తూనే వుంది. ఇంచుమించు అందరిదీ ఒకటేమాట. అన్ని రకాలుగా ఆయన అదృష్ట వంతుడని. వాళ్లందరూ అన్నారనే కాదు. ఆయన ఉద్దేశం కూడా అదే. పిల్లలందరూ మంచి స్థితిలో వున్నారు. ఆరోగ్యం ఇబ్బందుల్లేవు.

ఆర్థిక ఇబ్బంది అసలేలేదు. సొంత ఇల్లుంది. ఇంట్లో ప్రశాంతత వుంది. బ్యాంకులో నాలుగు లక్షల డబ్బుంది. పిల్లలు కొండంత ధైర్యం. భార్య భర్త ఇద్దరే ముచ్చటైన ఆ ఇంట్లో పద్ధతిగా బతుకుతున్నారు. వీటితోపాటు నివాసం వుంటున్న ఆ వీధికూడా ఆయనకెంతో ప్రీతి పాత్రం . ఆ ఇల్లు ఆవీధి కూడా అకస్మాత్తుగా ఊడిపడినట్టు ఏర్పడినవి కావు. రామనాథంగారు బ్యాంక్ మేనేజరుగా ఉన్నప్పుడే, తన దగ్గరి మిత్రుల్ని కొందర్ని కూడగట్టి. ఆ కాలనీలో ఓ పక్కగా వున్న ఆ స్థలాన్ని కొన్నారు. వీధికి అటు ఎనిమిది, ఇటు ఎనిమిది మొత్తం పదహారు ప్లాట్లు వచ్చాయి. అందరూ ఒకరికొకరు బాగా తెలిసున్న వాళ్ళే. స్నేహంగా కలిసిపోయిన వాళ్ళే.

అందరూ కొంచెం అటూ ఇటూగా లోన్లు తీసుకుని ఇళ్ళు కట్టుకున్నారు. లోన్లూ తీరిపోయాయి. ఈ ఇళ్ల కార్య క్రమానికి సూత్రధారి, కార్యకర్త రామనాథం గారే. వీళ్లలో ఎవరింటికి ఏ కొత్తవారు వచ్చినా, ఆ ఇళ్ళ నిర్మాణం కథ ఆ కొత్త వాళ్ళకి వివరించడం ఓ అనుకోని అలవాటు అయింది. ఆ వీధిపట్ల వాళ్లందరికీ వున్న మమకారం, తృప్తి అలాంటివి.

మళ్ళీ మరో గాలితెర... ఈ సారి పాట మరింత గట్టిగా వినపడింది. ఇంకలేవకుండా కూచోలేకపోయారు ఆయన. వీధి తలుపు తీసుకుని, ఇంటిగేటు దాకా వెళ్ళేటప్పటికే అదేమిటో అర్థమయిపోయింది రామనాథం గారికి. క్లారినెట్ వాద్యం...వీధి చివరనుంచి వినపడుతోంది. ఎప్పటి పాట... 'చల్లని రాజా... ఓ చందమామ... నీ కథలన్ని తెలిశాయి ఓ చందమామ...' అసలే అరుదైన ఇన్‌స్ట్రుమెంట్... చిన్నప్పటి పాట... అతను శ్రుతిపక్వంగా ముచ్చటగా పలికిస్తున్నాడు.

సన్నగా ఓ మాదిరి ఎత్తు... తెల్లటి పంచె... పొడుగు చేతుల చొక్కా ... పాట పల్లవి నుంచి చరణంలోకి సాగింది. తన వైపే వస్తున్నట్టున్న ఆ పాటని కౌగిలించు కోవాలన్నట్టు ఓ అడుగు అటు వేశారు రామనాథంగారు.

ఆ పాటరోజులు... ఆయన హైస్కూల్లో చదువుకుంటున్న రోజులు... అప్పటి పాటలు... అప్పటి సినిమాలు... చక్కటి కమ్మటి ఇలాంటి పాటలకోసం పదేపదే సినిమాలు రోజుల తరబడి చూసేవాళ్ళు.

ఆ పాట వింటూనే జ్ఞాపకాలలో ప్రయాణం... అతను అన్ని ఇళ్ళుదాటి రామనాథం

గారి ఇంటికి వచ్చేటప్పటికి ఆ పాట అయిపోయింది. 'పిలువకురా...అలుగకురా' సువర్ణసుందరి సినిమాపాట వాయిస్తున్నాడు.

అడుక్కోడానికి పాటలు నేర్చుకున్నట్టుగా లేదు అతని వాయిద్యం. నేర్చుకున్నదాన్ని అడుక్కోడానికి వాడుకుంటున్నట్టుంది. రామనాథం గారి ఇంటిముందుకు వచ్చాడు. తనవైపే తరచి తరచి చూస్తున్న రామనాథంగారిని బిత్తరపోయి చూస్తూ నిలబడిపోయాడు అతను. పాట వాయించగా, వాయించగా లోపల్నించి ఎవరో ఒకరు వస్తే రావడం... ఇస్తే ఏదో ఇకటి ఇవ్వడం... లేకపోతే వెళ్ళమనడం తప్ప... ఇలా తనకన్నా ముందే గుమ్మం దగ్గరుండి ఇలా తేరిపార చూడ్డం, అతని అనుభవంలో అరుదు.

అతని బిత్తరపాటు గ్రహించిన రామనాథం గారు పలకరింపుగా నవ్వారు. అతనూ నవ్వాడు. వాయించమన్నట్టు తలూపారు రామనాథంగారు. లోపలికి పిలిచారు.

అతను పాట అందుకున్నాడు. అదయ్యాక మాటలు...మళ్ళీ పాట... తిరిగి మాటలు... అలా ఓ ఇరవైనిముషాలు ఇద్దరికీ పరస్పర కాలక్షేపం జరిగింది. అన్నీ అప్పటి పాత పాటలే...

ప్రతి పాటలో కొన్ని జ్ఞాపకాలు...కొందరు వ్యక్తుల స్మరణ... అదీ రామనాధంగారి స్థితి... ఎన్నిచోట్ల ఎన్ని వీధులు తిరిగినా, ఎందరి ఇళ్లముందు నిలబడినా, అందరూ అదనపు భారంగానే తప్ప ఇలా ఓ మాటా ...మంతీ.... ఈ మధ్య కాలంలో ఎరగడు అతను... అది అతని పరిస్థితి.

అతని పేరు సన్యాసి... సన్యాసి రాజని... అసలు గుంటూరు ప్రాంతమని... నాటకాల సరదాతోటి... మ్యూజిక్ ట్రూప్ అనుభవంతోటి క్లారినెట్ అబ్బిందని... అన్ని రకాలుగా జీవితం చెడ్డాక... ఇప్పుడీ భాగ్యనగరంలో ఆ క్లారినెట్ పాటలే అడుక్కోడానికి ఆధారమయ్యాయని ఆ స్వల్పసమయంలో రామనాథంగారు అడిగి తెలుసుకున్నారు. పెద్దగాఆలోచనేం లేకుండానే "రేపు ఆదివారం వస్తావా..." అని అడిగారు రామ నాథంగారు...

"అలాగే" అన్నాడు సన్యాసి రాజు.

సాయంత్రం నాలుగింటికి అతను వచ్చేలా, ఆ రోజుకి సరిపడా అతని ఆర్థిక బాధ్యత తనదిగా సన్యాసిరాజుతో మాట్లాడారు రామనాధంగారు.

=======

ఆదివారం సాయంత్రానికి ఓ చిన్న సమావేశంలా, ఆ పదహారు ఇళ్ళ వాళ్ళకీ చెప్పి ఏర్పాటు చేశారు రామనాధం గారు. ఇళ్లల్లోని చిన్న వయసు, మధ్య వయసు వాళ్ళందరూ రాకపోయినా, రామనాధంగారి మిత్ర బృందమంతా సమావేశం అయ్యారు.

నాలుగ్గంటలకన్నాకొంచెం ముందుగానే వచ్చాడు సన్యాసిరాజు. అతని అలవాటుకాబోలు... 'చల్లని రాజా... ఓ చందమామ...' పాటతోటే ఆరంభించాడు. ఆ తర్వాత... 'ఆకాశ వీధిలో అందాల జాబిలి' .... 'లాలి పాపాయి జో' ఇలా అదో ధారలా అతని క్లారినెట్ పలికింది. భాగ్యరేఖ, మాంగల్య బలం, రక్త సంబంధం... ఎప్పటి సినిమాలు. వింటున్న వారిలో అదో ప్రయాణం అదో తన్మయత్వం... ఓ మాదకత...

ఇవే పాటలు అప్పుడప్పుడు టీవిలో, రేడియోలో వినడం వేరు... ఈ అనుభవం వేరు... అందుకే కొంతమంది లైవ్ ప్రోగ్రామ్ అంటే ప్రాణం ఇస్తారు.

తనంతట తాను సన్యాసిరాజు వాయించిన పాటలే కాక , వీళ్ళు అడిగిన పాటలు మరికొన్ని... పాటకీ పాటకీ మధ్య... సినిమాల వివరాలు... అప్పటి సంగతులు.

కొద్ది గంటలసేపు సన్యాసి రాజు అడుక్కునే వాడన్నది ఎవరికీ జ్ఞాపకం లేదు. అతనిక్కూడా..

రాత్రికి భోజనం పెట్టి రెండు వందలు ఇచ్చి పంపించారు రామనాథంగారు. అతనికళ్లల్లో మెరిసిన తడి ఎంతో స్పష్టంగా కనిపించింది ఆయనకి.

సన్యాసి రాజు వెళ్లి పోయినా, అతని పాటలు ఆ ఆవరణని వదల్లేదు. మంచి నాణ్యమయిన తేనె రుచిలాగ నాలుక చుట్టూ అల్లుకున్నట్టు... వెన్నెల మంచు కల గలిపి కమ్ముకున్నట్టు... రామనాథం గారు, స్నేహితులు ఆ రాత్రి పన్నెండింటి వరకూ మైమరచి గడిపారు.

సంసారం సినిమాకి కుండపోత వర్షంలో మరదలితో కలిసి సెకండ్‌షో సినిమాకి వెళ్లిన సంఘటన గుర్తొచ్చింది రామనాథంగారికి.

చీకటిలో వర్షం చప్పుళ్ళు, సగం పైగా తడిసి ఆమెతో ఇంటికి తిరిగి వచ్చిన మధుర జ్ఞాపకం... ఏ శృంగార అనుభవానికీ తక్కువ కాదు... తామిద్దరికీ పెళ్ళి కాకుండానే ఆమె చనిపోయిన బాధ... ఆరోజే మిత్రులతో చెప్పుకోగలిగారు రామనాథంగారు... ఒక్కొక్కరికీ ఒకోరకం అనుభవం... గడిచిన మజిలీలు... ఈ పాటల జ్ఞాపకాలలో మధురంగా మత్తయిన బాధగా వున్నాయి. సినిమా పాటలకి జీవితాన్ని తిరిగి ఇలా... ఇంతగా చూపించే శక్తి వుందా అనిపించిన రాత్రి అది.

ఆ రాత్రి గడిచినా, సన్యాసిరాజుని మరిచిపోలేదు. భాగ్యనగరంలోని అతని బతుకు దైన్యాన్ని మరిచిపోలేదు రామనాథంగారు.

సన్యాసిరాజుకి ఇద్దరు పిల్లలు. భార్యలేదు. పోయి నాలుగేళ్ళయింది. కొడుకూ, కోడలు రోజుకూలీ ఉద్యోగాలు. వాళ్ళకి ఒక్కడే కొడుకు. వాడికి ఏడాది వయసు. పుట్టకముందునుంచే గుండె లోపం... ఆపరేషన్ చెయ్యాలి. చేయించే స్థోమతలేదు.

సన్యాసిరాజు కూతురుకి ఇరవై ఏళ్లు.. ఆ అమ్మాయికి పెళ్ళి అవ్వాలి.

'ఆడపిల్ల బాధ్యత తనదే కదా...' అన్న దిగులు, మనవడికి పెద్ద వైద్యం చేయించగలిగితే అన్న ఆశ... సన్యాసిరాజుకి. చన్నీళ్ళుకి వేన్నీళ్ళులా క్లారినెట్‌తో అరవై పైబడిన వయసులో అదుక్కోవడం, తప్ప... ఏం చెయ్యలేకపోతున్నాడు.

తన అరవై ఏళ్ల జీవితంలో ఎన్నోబాధలుపడ్డారు రామనాథంగారు.సన్యాసిరాజు బతుగ్గురించి వినగానే బాధేసింది. ఆ బాధ వదల్లేదు. ఇద్దరికీ మధ్య సంబంధం ఏమిటంటే, గట్టిగా చెప్పుకోగలిగిందేం లేదు. అయినా ఏదో బంధం ఉన్నట్టే కలుక్కుమంటోంది ఆలోచన.

రామనాధం గారికి ఆర్థికంగా ఇబ్బందులులేవు. పిల్లలు అడిగితే సహాయం చెయ్యగలిగే పరిస్థితిలోనే వున్నారు. కానీ ఆయన ఆలోచన ఆ దారిలో లేదు. ఇప్పుడు లేని ఆర్థిక ఇబ్బంది రేపు రాకూడదని లేదు. భార్య భర్తలిద్దరూ ఇప్పుడు బాగానే వున్నా రేపు ఏమో... పిల్లలమీద ఆధార పడటం అంతగా సరి అనిపించలేదు. తనంతగా తను సన్యాసిరాజుని ఆదుకోవడం కన్నా వేరే మార్గం వుందా అని యోచించారు.

విడిగా, మిత్రులతో కలిసి రకరకాలుగా ప్రయత్నించారు రామనాధం గారు. వెంటనే కాకపోయినా ఆరు నెలల కాలంలో చక్కటి మార్గాలే దొరికాయి. సన్యాసి రాజు మనవడికి ప్రశాంతి నిలయంలో ఉచితంగా వైద్యం అందింది. పిల్లాడు కోలుకున్నాడు.

ఓ అనాధ శరణాలయంలో పెరిగి ఉద్యోగం చేసుకుంటూ చెయ్యి కాల్చుకుంటున్న నాగేంద్రంతో సన్యాసి రాజు కూతురు పెళ్లి కుదిర్చారు. చక్కగా పెళ్ళి జరిగి ఆ పిల్ల కాపురానికి వెళ్లింది. సూత్రధారి రామనాధంగారే అయినా, మిత్రుల తోడ్పాటు ఉపయోగపడింది.

విడిగా అయితే మనసు, శరీరం అలసిన సన్యాసి రాజుకి ఇది ఏ మాత్రం సాధ్యం అయ్యేది కాదు.

సన్యాసిరాజు ఆనందం అంతా ఇంతా కాదు. అతని ముఖం, బతుకు రెండూ తేటబడ్డాయి.

ప్రతి ఆదివారం వస్తూనే వున్నాడు. రామనాథం గారి మిత్రుల ద్వారా ఏర్పడిన పరిచయాలతో రోజూ వృద్ధాశ్రమానికి వెళ్ళి తన పాటలు వినిపిస్తాడు సన్యాసి రాజు. అక్కడి సంగీతం ఈ ముసలాళ్ళకి. ఈ ముసలాళ్ళ కబుర్లు వాళ్ళకీ చెప్పడం అతనికీ బాగుంది.

జీవితంలో పెద్దమార్పేంలేదు. అయినా వ్యక్తిగతంగా, ఇది రామనాధంగారికి ఒక చక్కటి అనుభవంలావుంది. అలాగే ఆలోచిస్తుంటే చక్కటి అనుభవాలు తప్ప జీవితం మరేమిటిలే అనిపించింది.

– స్వాతి మాసపత్రిక డిసెంబరు 2008